క్లుప్తంగా

రీ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

ఆర్డీఓ రామలక్ష్మి



వేమూరు: ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రామాల్లో రీ చేస్తున్నట్లు రేపల్లె ఆర్డీఓ రామలక్ష్మి తెలిపారు. తహసీల్దారు కార్యాలయంలో రీ సర్వేపై శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రీ సర్వే చేసిన గ్రామాల్లో రైతులకు పాస్ పుస్తకాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. వీఆర్వోలు, సర్వేయర్లు సక్రమంగా పని చేయాలని ఆమె హెచ్చరించారు. రీ సర్వే గ్రామాల్లో రైతులు నుంచి ఫిర్యాదు వస్తే వారిపై చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుశీల, డెప్యూటీ తహసీల్దార్ రవీంద్ర పాల్గొన్నారు.

పీ 4లో ప్రజలను భాగస్వాములను చేయాలి



వేమూరు: పీ 4 సర్వే సక్రమంగా చేయాలని రేపల్లె పంచాయతీ డివిజన్ ఇన్చార్జి అధికారి, బాపట్ల జిల్లా డ్వామా ప్రాజెక్ట్ అధికారి పద్మజ తెలిపారు. వేమూరు పంచాయతీ కార్యాలయంలో గ్రామ సచివాలయం సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పేద కుటుంబాలను సక్రమంగా సర్వే చేయాలని సూచించారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామంలో సందర్శించారు. పారిశుద్ధ్యం కార్యక్రమాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్చార్జి ఎంపీడీఓ శేఖర్, తహసీల్దార్ సుశీల, పంచాయతీ కార్యదర్శి భూపతి రెడ్డి పాల్గొన్నారు.

ఆరు ఎకరాల వరిగడ్డి వామి దగ్ధం



చందోలు(కర్లపాలెం): ప్రమాదవశాత్తు వరి గడ్డి వామి దగ్ధమైన ఘటన పిట్టలవానిపాలెం మండల పరిధిలోని చందోలు శివారు నదిముల్లాయపాలెం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రైతు షేక్ ఖాదర్‌వలి, పశువుల కోసం వేసి ఉంచిన సుమారు ఆరు ఎకరాలలోని వరిగడ్డి వామిలో మంటలు ఎగసి పూర్తిగా దగ్ధమైంది. ఫైర్ ఇంజన్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించినా అప్పటికే పూర్తిగా దగ్ధమైందని స్థానికులు తెలిపారు.

పాఠశాలలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర

భట్టిప్రోలు: భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్ ఆవరణలో శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ నీలం దేవరాజు మాట్లాడుతూ హైస్కూల్స్, పాఠశాలల్లో విద్యార్థులు భాగస్వాములై ఉండాలని కోరారు. పరిసరాలను అందంగా, పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని తెలిపారు. ప్రతి నెలకు అంశాన్ని థీమ్‌గా తీసుకుని ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చందలూరి రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

కుచ్చెళ్లపాడులో..

కుచ్చెళ్లపాడు(వేమూరు): స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కింద గ్రామ పంచాయతీలను శుభ్రం చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరూపై ఉందని ఇన్చార్జి ఎంపీడీఓ సీహెచ్ శేఖర్ తెలిపారు. వేమూరు మండలంలోని కుచ్చెళ్లపాడు గ్రామంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి గాజులు వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

చెరుకుపల్లి: పరిశుభ్రత ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని ఈఓపీఆర్డీ కేసీపి శ్రీనివాసన్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు.

మోపర్రులో..

అమృతలూరు(వేమూరు): స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర భాగంగా తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలని మండల పరిషత్ పరిపాలన అధికారి మధుసూదనరావు తెలిపారు. అమృతలూరు మండలంలోని మోపర్రు గ్రామంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. స్వరాంధ్ర, స్వచ్ఛాంధ్రపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు నెహ్రూ బాబు, మండల విద్యా శాఖాధికారి కనపాల రమేష్ పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలి

తెనాలిఅర్బన్: క్యాన్సర్ వ్యాధిపై విద్యార్థినులు అవగాహన కలిగిఉండాలని జేఎంజే మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ శాంత సూచించారు. స్థానిక కళాశాలలో శనివారం బసవతారక ఇండో- అమెరికన్ క్యాన్సర్ హాస్పటల్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం పలు రకాల టెస్టులు చేశారు. తెనాలి పరిసరాల గ్రామాల నుంచి వచ్చిన మహిళలకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

సీనియర్ సివిల్ జడ్జి వెన్నెల



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెన్నెల, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి దివ్యసాయి శ్రావణి

రేపల్లె: లోక్‌అదాలత్ ద్వారా సత్వర న్యాయం అందుతుందని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎస్‌పీడీ వెన్నెల అన్నారు. పట్టణంలోని సబ్‌కోర్టు హాలులో కోర్టు పరిధిలోని పోలీసు స్టేషన్‌ల అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సెప్టెంబర్ 13వ తేదీ నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కారమయ్యేలా పోలీసు అధికారులు కృషి చేయాలని కోరారు. పరిష్కరించదగిన కేసులను, రాజీమార్గాన్ని ఎంచుకున్న కక్షిదారుల కేసులను, క్రిమినల్, సివిల్ ప్రీలిటిగేషన్ వంటి కేసులు లోక్‌అదాలత్‌లో పరిష్కారమయ్యేలా పనిచేయాలని సూచించారు. లోక్‌అదాలత్‌తో కక్షిదారులకు సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు. కక్షిదారులు తమ సమస్యలను లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి వి.దివ్యసాయి శ్రావణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.వెంకట గిరిధర్, సెక్రటరీ యు.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్షణికావేశంలో నేరాలకు పాల్పడొద్దు

రేపల్లె: క్షణికావేశంలో నేరాలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోరాదని, సత్ప్రవర్తనతో కూడిన జీవితాన్ని అవలంబించాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎస్‌పీడీ వెన్నెల అన్నారు. పట్టణంలోని సబ్‌జైలులో ఖైదీలకు అందిస్తున్న సేవలపై శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సబ్‌జైలులోని రిమాండ్ ఖైదీలతో ఆమె మాట్లాడుతూ ఇతరులతో మంచిగా మెలుగుతూ తోటివారికి సాయం చేసే గుణాన్ని అలవర్చుకోవాలని సూచించారు. రిమాండ్ ఖైదీలకు పలు రకాల సేవలను అందించడం జరుగుతుందని సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం సబ్‌జైలులోని పరిసరాలు, ఖైదీల గదులు వారికి అందిస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. కార్యక్రమంలో సబ్‌జైల్ సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంలో కూటమి విఫలం

ముత్తుపల్లిలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ

ముత్తుపల్లి(రేపల్లె): ప్రజలకు సంక్షేమ పాలన అందించడంలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయటంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్ సీపీ నిజాంపట్నం మండల కన్వీనర్ యార్లగడ్డ వెంకట రాంబాబు ఆరోపించారు. నిజాంపట్నం మండలం ముత్తుపల్లిలో శనివారం సాయంత్రం వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. రాంబాబు మాట్లాడుతూ 15 నెలల కూటమి పాలనలో ప్రజానీకానికి, రాష్ట్రానికి మేలు జరిగిందేంలేదని ధ్వజమెత్తారు. సంక్షేమ పథకాలకు పాతర వేస్తూ ప్రభుత్వం ప్రజలను నయవంచనకు గురి చేస్తుందని ఆరోపించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాల కంటే మెండుగా అందిస్తామని ఎన్నికలకు ముందు ఉకదంపుడు హామీలతో ప్రజలు నమ్మించి అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన అమ్మ ఒడి పథకాన్ని తల్లికి వందనంగా పేరు మార్చి అరకొరగా అమలు చేసి తల్లుల ఉసురుపోసుకున్నారని మండిపడ్డారు. ఉచిత బస్సు పథకం అమలులో ఆంక్షలు విధిస్తూ మహిళలను తీవ్రంగా మోసగించారన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధాలపై ప్రశ్నించే పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలపై అక్రమ కేసులు బనాయిస్తూ నోరు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఎన్ని ఇబ్బందులుకు గురి చేసిన వైఎస్సార్ సీపీ ప్రజల తరపున ఉద్యమాలు చేపడుతుందని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ చిత్రాల ఓబేదు, జిల్లా ఉపాధ్యక్షులు చదలవాడ శ్రీనివాసరావు, జిల్లా అధికార ప్రతినిధి కేవీ కృష్ణారెడ్డి, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షులు దొంతుబోయిన కొండల్ రెడ్డి,నగరం మండల కన్వీనర్ ఇంకొల్లు రామకృష్ణ, నాయకులు యార్లగడ్డ మదన్మోహన్, బెజవాడ జోసెఫ్, అనంతలక్ష్మి, సముద్రాల ప్రభుకిరణ్ పాల్గొన్నారు.



కూటమి ప్రభుత్వ ఎన్నికల మేనిఫెస్టో క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

ఎరువులు కొరత లేకుండా చర్యలు



ఆలపాడు రైతు సేవా కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్



మాట్లాడుతున్న అమృతలూరు ఏఓ హేమంత్ భరత్‌కుమార్

తహసీల్దార్ నాగరాజు

చుండూరు(వేమూరు): రైతులకు ఎరువులు కొరత లేకుండా చర్యలు తీసుకున్నట్లు చుండూరు తహసీల్దారు నాగరాజు తెలిపారు. చుండూరు మండలంలోని ఆలపాడు గ్రామంలోని రైతు సేవా కేంద్రాన్ని శనివారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతు సేవా కేంద్రంలో 20 టన్నులు డీఏపీ ఉందన్నారు. యూరియా కొరతగా ఉందన్నారు. మండలంలోని సాగు చేసిన పొలాలుకు సకాలంగా ఎరువులు అందించేందుకు పూర్తిగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. డీలర్లు ఎరువుల కొరత చూపించి రైతులను ఇబ్బందులు గురి చేస్తే వారిపై కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతందని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఆదాం బాబు పాల్గొన్నారు.

ఎరువులు నిబంధనలకు విరుద్ధంగా నిల్వ చేస్తే చర్యలు

అమృతలూరు(వేమూరు): ఎరువులు నిబంధనలకు విరుద్ధంగా నిల్వ చేస్తే తగిన చర్యలు తప్పవని మండల వ్యవసాయశాఖ అధికారి ఎం.హేమంత్ భరత్ కుమార్ తెలిపారు. వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఎరువుల షాపుల యాజమాన్యం, వ్యవసాయ శాఖ సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాపట్ల జిల్లా కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారి ఆదేశాలు మేరకు ఎరువులు కృత్రిమ కొరత, యూరియా అక్రమ నిల్వలు తనిఖీ చేసేందుకు తహసీల్దారు, ఏఎస్ఐ, ఏఓలతో మండల స్థాయి కమిటీ ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎరువుల షాపులు సందర్శించి ఎరువుల నిల్వ, సరఫరా బిల్లులు తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబులు పీవీ కృష్ణ, కొత్తపల్లి రవీంద్ర, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు తహసీల్దార్ శ్రీనివాసరావు

రేపల్లె: ఎరువులను కృత్రిమ కొరత సృష్టిస్తూ అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావు హెచ్చరించారు. పట్టణంలోని సాహితీ ఏజెన్సీ ఎరువుల దుకాణాన్ని శనివారం రాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌కు సంబంధించిన ఎరువులు అన్ని అందుబాటులో ఉన్నాయన్నారు. స్టాక్ వివరాలు, ఎంఆర్పీ బోర్డులపై ప్రదర్శించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అవ్వారు మహేష్ బాబు, ఎస్ఐ రాజశేఖర్ ఉన్నారు.

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

చెరుకుపల్లి: ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి ఎండీ ఫరూక్ హెచ్చరించారు. శనివారం మండలంలోని ఎరువుల దుఖాణాల్లో మండల వ్యవసాయ శాఖ అధికారి ఆధ్వర్యంలో విజిలెన్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహిచారు. ఏఓ మాట్లాడుతూ మండలంలోని రైతు సేవా కేంద్రాల ద్వారా, మర్కెట్‌యార్డు ద్వారా, సొసైటీల ద్వారా రైతులకు అవసరమైన ఎరువులు ఎప్పటికప్పుడు దిగుమతి అవుతున్నాయన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారులు ఎస్‌కే సైదులు, లక్ష్మీమాధవి పాల్గొన్నారు.



రేపల్లెలో ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న తహసీల్దార్



చెరుకుపల్లిలో ఎరువుల షాపు తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

చవితి ఉత్సవాల్లో నిబంధనలు పాటించాలి

ఎస్ఐ అనీల్ కుమార్

చెరుకుపల్లి: వినాయక చవితి మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఎస్ఐ టి.అనీల్ కుమార్ సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో శనివారం మండల పరిధిలో వినాయక చవితి ఉత్సవ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ మండపాలు ఏర్పాటు చేసుకునేవారు ముందుగా పోలీస్, రెవెన్యూ, విద్యుత్‌శాఖల అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్‌కు ఎటువంటి ఆటంకం కలగకుండా మండపాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. మండపాల వద్ద ప్రతిరోజు రాత్రి కమిటీ సభ్యులు ఎవరో ఒకరు కాపలా ఉండాలని చెప్పారు. ముఖ్యంగా నిమజ్జన సమయంలో మద్యం తాగి ఉండరాదని, పవిత్ర వినాయక చవితిని భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని కమిటీలకు సూచించారు.



వినాయక చవితి ఉత్సవాల కమిటీ సభ్యులకు సూచనలు ఇస్తున్న ఎస్ఐ

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చుండూరు(వేమూరు): విద్యుత్ లైన్ల మరమ్మతులు నిమిత్తం ఆదివారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ దోనేపూడి అర్జునరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ ఉండదని చెప్పారు. చుండూరు మండలంలోని చినపరిమి, మండూరు, ఆలపాడు, కారుమూరువారి పాలెం, చినగాదెలవర్రు, పెదగాదెలవర్రు, అరమండ పేట గ్రామాల వినియోగదారులు గమనించాలని కోరారు.


గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు

తెనాలిటౌన్: మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకున్నట్లు డీఎల్‌పీఓ స్వరూపరాణి పేర్కొన్నారు. రూరల్ మండలం నందివెలుగులో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఆమె వెంట డెప్యూటీ ఎంపీడీఓ వైవీడీ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి బి.హేమకుమారి పాల్గొన్నారు.

వెండితెరపై 'తెనాలి రౌడీ'

కొంగర జగ్గారావు

- విలనీని పండించిన నటుడు
- కాంగ్రెస్ సేవాదళ్ నుంచి సినిమాకు
- ఆర్.నాగేశ్వరరావు మరణంతో ఆహ్వానం
- 'సాక్షి' జగ్గారావుగా, దుశ్శాసనుడిగా గుర్తింపు
- కెరీర్‌లో 500 పైగా చిత్రాల్లో నటన



విశ్రాంత జీవనంలో



కొంగర జగ్గారావు

తెనాలి: వెండితెర రౌడీగా తెలుగు సినీపరిశ్రమలో గుర్తింపు పొందిన నటుడు కొంగర జగ్గారావు. కాంగ్రెస్ సేవాదళ్‌లో కీలకంగా పనిచేస్తూ, టంగుటూరి ప్రకాశం పంతులు, గౌతులచ్చన్న, ఎన్జీరంగా అనుంగు శిష్యుడిగా మెలిగిన జగ్గారావు, అనుకోని పరిస్థితుల్లో తనకిష్టం లేని సినీరంగానికి వెళ్లాల్సి వచ్చింది. విలన్‌కు ప్రత్యామ్నాయం కోసం ముఖానికి మేకప్ వేసుకున్న జగ్గారావు, ఆ విలన్ పాత్రలతోనే రాణించారు. 'భీష్మ', 'శ్రీకృష్ణపాండవీయం', దానవీరశూర కర్ణ', 'అడవి రాముడు', 'మోసగాళ్లకు మోసగాడు' మొదలుకుని 'అంతఃపురం', 'డాన్' వరకు 500 పైగా సినిమాల్లో నటించారు. 'సాక్షి' జగ్గారావుగా, దుశ్శాసనుడిగా ప్రేక్షకుల మనసుల్లో నిలిచిపోయారు. ఈనెల 26న ఆయన శతజయంతి సందర్భంగా...

మోరంపూడి స్వగ్రామం..

తెనాలి దగ్గర్లోని దుగ్గిరాల మండల గ్రామం మోరంపూడి జగ్గారావు సొంతూరు. 'కళావాచస్పతి' కొంగర జగ్గయ్యకు దగ్గర బంధువు. తల్లిదండ్రులు ఈశ్వరమ్మ, వెంకటప్పయ్య. 1925 ఆగస్టు 26న జన్మించారు. ఊళ్లోని ప్రాథమిక విద్యతో సరిపెట్టుకుని పసుపు వ్యాపారంలో ఉన్న తండ్రికి తోడుగా ఉండసాగాడు జగ్గారావు. నేతాజీ, గాంధీ అంటే ఇష్టంతో 'ఆలిండియా కాంగ్రెస్ సేవాదళ్'లో అధికారిగా శిక్షణకోసం నాగపూర్ వెళ్లాడు. అనంతరం రాష్ట్ర సేవాదళ్‌ను ఆర్గనైజ్ చేస్తూ గౌతు లచ్చన్న ఆధ్వర్యంలో సేవాకార్యక్రమాలు చేస్తుండేవారు. కార్యకర్తలకు డ్రిల్, కర్రసాము శిక్షణతో బిజీగా ఉంటూ వచ్చాడు. తురుమెళ్లకు చెందిన పర్వతనేని శాంతాదేవితో వివాహమైంది. కుటుంబం కోసం ఉద్యోగం తప్పనిసరైంది. ఎన్జీ రంగా సిఫార్సుతో మాచర్లలోని సిమెంట్ ఫ్యాక్టరీలో ట్రాన్స్‌పోర్ట్ అసిస్టెంట్‌గా చేరారు. మకాం అక్కడకు మారింది.

ఆర్.నాగేశ్వరరావుతో మృతితో..

అప్పట్లో సినిమాల్లో ఆర్.నాగేశ్వరరావు విలన్‌గా చేస్తుండేవారు. జగ్గారావును చూసినవారు ఆ నటుడితోనే పోలుస్తుండేవారు. జగ్గారావుకు మాత్రం సినిమాలంటే ఇష్టం ఉండేది కాదు. తెనాలికి చెందిన సినీనిర్మాత, రచయిత చక్రపాణి బంధువు నలజాల సుబ్బారావు ఒకరోజు వచ్చి, అర్జెంటు అంటూ జగ్గారావును మద్రాస్ తీసుకెళ్లారు. రేలంగి తీస్తున్న 'సమాజం' సినిమాలో నటిస్తున్న ఆర్.నాగేశ్వరరావు చనిపోయారు. ఆ స్థానంలో నటించాలని కోరటంతో కాదనలేకపోయారు జగ్గారావు. మేకప్ వేశాక 'అచ్చు ఆర్.నాగేశ్వర్రావే' అన్నారు. పాండీబజారుకు పాకిందా వార్త. ఎన్టీఆర్ నటిస్తున్న 'భీష్మ' సినిమాకూ పిలుపొచ్చింది. దుశ్శాసనుడి వేషం ఇచ్చారు. ఆ విధంగా ఆర్.నాగేశ్వరరావు చనిపోయి జగ్గారావును సినిమారంగానికి తీసుకొచ్చినట్టయింది.

'భీష్మ'తోనే ఎన్టీఆర్‌తో స్నేహం కుదిరింది.

'భీష్మ'తోనే ఎన్టీఆర్‌తో స్నేహం కుదిరింది. ఎన్టీఆర్ తీసే సినిమాల్లోనే కాకుండా ఆయన నటించే ఇతర నిర్మాతల సినిమాలకూ జగ్గారావును సిఫార్సు చేసేవారు. ఇక విఠలాచార్య సినిమాల్లో తప్పనిసరి అవకాశం ఉండేది. తనతోపాటు ఆనందమోహన్, త్యాగరాజు, రాజనాల, సత్యనారాయణ విలన్లుగా ఉండేవారు. వాళ్లు మెయిన్ విలన్లు అయినా జగ్గారావుకో పాత్ర ఉండేది. సినిమాల్లో గుర్రమెక్కడం అంటే భలే సరదా. ఆయన సిగరెట్ తాగే స్టైల్ ప్రత్యేకం! ఫైటింగుల్లో డూప్‌ను ఇష్టపడేవారు కాదు. 'లక్ష్మీకటాక్షం' సినిమాలో ఓ ఫైటింగ్ సీనులో జీవిస్తూ ఎన్టీఆర్ చేతిపై కత్తితో పొడిచారు. తర్వాతిరోజు స్వయంగా కలిసి క్షమాపణ చెప్పారు. ఎన్టీఆర్ తేలిగ్గా తీసుకుని 'డోంట్ వర్రీ బ్రదర్' అనేశారని ఒక సందర్భంగా జగ్గారావు చెప్పారు. 'ప్రాణమిత్రులు' చేస్తుండగా బాపురమణలు పిలిచారు. హీరో కృష్ణతో తీస్తున్న 'సాక్షి' సినిమాలో అవకాశమిచ్చారు. అద్భుతమైన విలనీని పండించి, 'సాక్షి జగ్గారావు'గా నాటి ప్రేక్షకులకు గుర్తుండిపోయారు. ఎస్వీ రంగారావు వేయాల్సిన ఆ వేషాన్ని జగ్గారావుతో వేయించి, ఆయన భవిష్యత్‌ను బాపురమణలు తీర్చిదిద్దారు. సినిమాలు చేస్తుండగా రెండుసార్లు ప్రమాదం నుంచి బయటపడ్డారు. సినీపరిశ్రమ హైదరాబాద్ తరలిరావటంతో జగ్గారావుకూడా వచ్చేశారు. ఫిలింనగర్‌లో ఉంటూ హౌసింగ్ సొసైటీలో కీలక పాత్రను పోషించారు. 2013 ఫిబ్రవరి 23న కన్నుమూశారు.

బైక్‌పై నుంచి పడి వ్యక్తి మృతి



బట్టు భాను తిరుమల(ఫైల్)

భట్టిప్రోలు: ద్విచక్ర వాహనం నుంచి పడి యువకుడు మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాలు.. మండలంలోని ఐలవరానికి చెందిన పెయింటింగ్ కార్మికుడు బట్టు భాను తిరుమల(23), స్నేహితుడు బట్టు జితేంద్ర ఎలియాస్ జిత్తులు కలసి రాత్రి ఐలవరం నుంచి ద్విచక్ర వాహనంపై భట్టిప్రోలు వెళ్తున్నారు. ఐలవరం అలివేలు మంగమ్మ సత్రం 214/ఎ రహదారి మార్గం వచ్చే సరికి జితేంద్ర డ్రైవింగ్ చేస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. వెనుక వైపు ఉన్న భాను తీవ్రంగా గాయపడడంతో 108లో జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. డ్రైవింగ్ చేస్తున్న జితేంద్ర గాయాలతో ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. మృతుడు తండ్రి లోకేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం. శివయ్య శనివారం తెలిపారు.

అప్పాజ్యోస్యులకు కళా విపంచి పురస్కారం



సత్యనారాయణకు పురస్కారం ప్రదానం చేస్తున్న అతిథులు

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శనివారం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా తెలుగు వెలుగు ఆత్మీయ పురస్కార సభ నిర్వహించారు. కళావిపంచి అధ్యక్షులు బొప్పన నరసింహారావు ఆధ్వర్యంలో జరగ్గా, గౌరవాధ్యక్షులు రామరాజు శ్రీనివాసరావు సభాధ్యక్షత వహించారు. అనంతరం ఆచార్య అప్పాజ్యోస్యుల సత్యనారాయణకు తెలుగు వెలుగు ఆత్మీయ పురస్కారం ప్రదానం చేసి సత్కరించారు. పలు రంగాల్లో, దేశ విదేశాలలో తెలుగు అభ్యున్నతికి ఆయన చేస్తున్న కృషి మరువ లేనిదని వక్తలు కొనియాడారు. ఆరాధన ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో గోవిందరాజులు నాగేశ్వరరావు రచన, నడింపల్లి వెంకటేశ్వరరావు దర్శకత్వం వహించిన పాప దొరికింది (హాస్య నాటిక) నాటిక ఆహూతులను అలరించింది. సభలో నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ప్రముఖ సాహితీవేత్త కందిమళ్ల సాంబశివరావు, సారస్వత కళానిధి డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి, ఉపాధ్యక్షుడు, కేసీపీ సిమెంట్ వజ్జా మధుసూదనరావు, ఆలయ పాలకమండలి అధ్యక్షులు సీహెచ్. మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, కళాపోషకులు డి.రామకోటేశ్వరరావు మాట్లాడారు. అనంతరం కళాకారులను, అతిథులను సత్కరించారు.

మాదకద్రవ్య రహిత సమాజ స్థాపనకు కృషి

సీఐ రాంబాబు



మాదకద్రవ్యలపై అవగాహన పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీఐ రాంబాబు, డీన్ ప్రసూనరాణి

బాపట్ల: మాదకద్రవ్య రహిత సమాజ స్థాపన విద్యార్థుల ధ్యేయం కావాలని బాపట్ల పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు పేర్కొన్నారు. వ్యవసాయ కళాశాలలో ఈగల్ టీమ్, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వినియోగం మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. అనంతరం ప్రదర్శన చేపట్టిన స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద మానవహారం నిర్వహించారు. కళాశాల డీన్ డాక్టరు ప్రసూనరాణి, బాపట్ల ఈగల్ టీం సభ్యులు దుర్గాప్రసాద్, సతీష్, వ్యవసాయ కళాశాల ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఎం.రమాదేవి, డాక్టర్ బి.రవీంద్రారెడ్డి, డాక్టర్ అబ్దుల్ సలాం, డాక్టర్ జి.వినయ్ కుమార్, డాక్టర్ విజయకుమార్ పాల్గొన్నారు.